క్లుప్తంగా

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



భగీరథ ఈఈ వెంకటపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: నల్గొండ జిల్లా పానగల్ గ్రామంలో మిషన్ భగీరథ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న సింగం పుష్పలత కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఈఈ వెంకటపతికి శనివారం వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు మూడెకరాల వ్యవసాయ భూమి, డబుల్‌బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివాకర్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ చౌరస్తా విజయ్ బస్తీ నుంచి సర్దార్‌బస్తీ వరకు కోనేరు రహదారిపై టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శనివారం ప్రారంభించారు. 4, 5 వార్డులతోపాటు ప్రజల సౌకర్యార్థం రోడ్డు పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ ఎస్.అంజయ్య, కౌన్సిలర్లు కె.శ్రీలత, వి.సాగరిక, శివప్రసాద్, ఎండీ వలీ, నియాజుద్దీన్ బాబా, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సౌందర్య

రెబ్బెన: మన ఊరు–మనబడిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ సౌందర్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మన ఊరు–మనబడిలో భాగంగా హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రారంభమైన మన ఊరు–మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న వెయిటింగ్ హాల్, టాయిలెట్లు, అదనపు తరగతి గదుల పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి



మొక్కలు అందజేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: ప్రతి ఇంట్లో ఆరు మొక్కలు నాటాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. హరితహారంలో భాగంగా కౌటాల పంచాయతీ కార్యాలయంలో శనివారం ఇంటింటా ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో మౌనిక, రైతు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉపసర్పంచ్ తిరుపతి, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, కార్యదర్శి సాయికృష్ణ, పార్టీ నాయకులు రవీందర్‌గౌడ్, బాపు, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్ సేవలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మైనార్టీ గురుకుల విద్యార్థులకు షీటీమ్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యురాలు సునీత మాట్లాడుతూ మహిళలు, యువతులకు షీటీమ్ అండగా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంపై వారికి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పుష్పలత, షీటీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన మోక్షమెప్పుడో?

- వర్షం కురిస్తే దిందా గ్రామస్తులకు తిప్పలు
- లోలెవల్ వంతెనపై నిలుస్తున్న వర్షపునీరు
- రాకపోలకు ఇబ్బంది



లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామం వర్షాకాలం వస్తే చాలు నెలలుగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటుంది. వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన వద్ద వర్షపు నీరు నిలుస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రం నుంచి గూడెం మీదుగా మహారాష్ట్రకు వెళ్లేదారిలో కేతిని నుంచి 3 కి.మీ దూరంలో దిందా గ్రామం ఉంది. దట్టమైన అటవీప్రాంతంలో రెండు వైపులా ప్రాణహిత నది, ఒకవైపు వాగు, మరోవైపు రహదారి సౌకర్యం లేకుండా ఈ గ్రామం ఉంది. గ్రామస్తులు బయటకు రావాలంటే కేతిని వైపు, చిత్తం వైపు వాగు దాటి రావల్సి ఉంటుంది. మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు ప్రాణహితలో నీటిమట్టం పెరిగి లోలెవల్ వంతెనపై నీరు నిలిచిపోతుంది. వంతెన నుంచి 3 నుంచి 8 మీటర్ల ఎత్తు వరకు నీరు నిలుస్తోంది.

వాగు దాటడం తప్పనిసరి

దిందా నుంచి పలు అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే గ్రామస్తులకు వాగు దాటడం తప్పనిసరి. వర్షాకాలంలో లోలెవల్ వంతెన పై వరదనీరు నిలుస్తుండడంతో గ్రామస్తులు ప్రాణాలకు తెగించి వాగు దాటుతుంటారు. ఈ క్రమంలో పలువురు మృతిచెందిన ఘటనలున్నాయి. వరద కారణంగా ఇతర సేవలందించని పరిస్థితి. పాఠశాలను మూసి వేస్తున్నారు. గ్రామానికి అంబులెన్స్ రాకపోవడంతో రోగులు తిప్పలు పడుతున్నారు. వాగుకు ఇవతలి వైపు వ్యవసాయ భూములుండడంతో రైతులు అష్టకష్టాలు కోర్చి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి.

పోరుబాట పట్టినా ఫలితం దక్కలేదు..

లోలెవల్ వంతెన కారణంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. పలు విన్నపాలు అనంతరం కేంద్ర నిధులతో హైలెవల్ వంతెన మంజూరైంది. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటవీశాఖ అనుమతులు మంజూరు కాలేదు. దీంతో అధికారుల తీరుపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గత రెండేళ్ల క్రితం వాగు వద్ద వరదనీటిలో గ్రామస్తులు ధర్నా నిర్వహించి వారం పాటు నిరసన తెలిపారు. వంతెన నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గతేడాది దిందా గ్రామానికి వంతెనకే పోరుదీక్ష చేపట్టిన యువకులకు అఖిలపక్షం నాయకులు మద్దతు తెలిపారు. దీక్షల అనంతరం గ్రామం నుంచి కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి హామీ వచ్చినా హైలెవల్ వంతెన పనులకు మోక్షం లభించలేదు.

హైలెవల్ వంతెన నిర్మించాలి



లోలెవల్ వంతెన పై వరద నీరు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రతి ఏడాది ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోంది. ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మించాలి. – నికాడె వెంకన్న, దిందా

ఫలితం లేదు



మా గ్రామం చేరుకునే మార్గంలో వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నాం. యువకులందరూ పోరుబాట పట్టాం. అయినా ఫలితం లేదు. – వాగుమారె తిరుపతి

మాలీ కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెరమెరి: మాలీలు అధికంగా ఉన్న అన్ని గ్రామాల్లో మాలి కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని ఖైరీ పంచాయతీ ప్రజలు, ఆసిఫాబాద్ డివిజన్ నాయకులు కోరారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఆసిఫాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, డివిజన్ ప్రధాన కార్యదర్శి లెండుగురే బాలాజీ, నాగోసే సోంనాథ్, గుర్నులె ఏమాజీ, బూత పోచయ్య, బూత భీమయ్య, ఎలమల మైసయ్య, సదు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో కలిసి బావిని పరిశీలిస్తున్న యాదవ్‌రావు

నార్నూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని పవర్‌హౌజ్ కాలనీలో శనివారం పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టిన ర్యాపిడ్ ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులకు ప్రజలు సహకరిస్తేనే ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వైద్యసిబ్బంది వినోద్, విజయ్‌కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ



ఎరువులు అందజేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బూర్గుడ, ఈదులవాడలో రైతులకు శనివారం ఎరువులు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ అలీ బిన్, ఏవో ఖాదర్‌హుస్సేన్, సర్పంచ్ భీమేశ్ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి నుంచి కెరమెరికి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారంతో ఆడ సమీపంలో శనివారం తెల్లవారుజాము తనిఖీ నిర్వహించారు. బోలేరో వాహనంలో ఐదు ఆవులను తరలిస్తుండగా పట్టుకుని గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. వీటిని తరలిస్తున్న హైదర్, అమీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఒంటికాలిపై నిల్చొని నిరసన



దహెగాం: ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



కౌటాల: ఒంటికాలి పై నిల్చొని నినాదాలు చేస్తున్న కార్మికులు

దహెగాం/కౌటాల/రెబ్బెన/కెరమెరి(ఆసిఫాబాద్)/కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి పదో రోజూ చేరింది. ఇందులో భాగంగా దహెగాం, కౌటాలలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఆయన నివాసంలో కలిసి కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు. కెరమెరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు పీసీసీ సభ్యురాలు మర్సకోల సరస్వతి మద్దతు తెలిపారు. రెబ్బెనలో సమ్మెల కొనసాగుతోంది.



గోరింటాకు వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని పలు వార్డుల్లో గోరింటాకు వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో పలు వార్డులకు చెందిన మహిళలు శనివారం గోరింటాకు పెట్టుకున్నారు. ఆటాపాటలో సరదాగా గడిపారు.

జీవం పోసిన వర్షం

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- పలుచోట్ల విరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితకు వరదనీరు

దహెగాం: వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి చిన్నపాటి చిరుజల్లులు కురిసింది. ఖరీఫ్‌లో విత్తుకున్న పత్తి విత్తనాలు మొలకెత్తగా, వరి సాగు ఆలస్యం అవుతుందని ఆందోళనలో ఉన్న రైతంగానికి శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం పంటలకు జీవం పోసినట్లయిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వానతో గాలి వీయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గెర్రె గ్రామంలో చెట్లు విరిగిపడ్డాయి. ఒర్రెలలో వరద నీరు పారింది. దహెగాంలో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

కౌటాల: మండలంలో శనివారం భారీ వర్షం కురవడంతో 43.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సాయన్న తెలిపారు. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నదిలో వరదనీరు పెరిగింది. పుష్కర ఘాట్ తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. గంగపుత్రులు చేపల వేటను నిలిపివేశారు. మహారాష్ట్రకు నాటు పడవల రాకపోకలు నిలిచిపోయాయి. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తిర్యాణి: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. చెలిమల గ్రామానికి చెందిన ఊర్వేత శంకర్‌కు చెందిన ఇంటి ముందు గల రేకులషెడ్డు నేలమట్టం అయింది. షెడ్డులో నిద్రిస్తున్న శంకర్‌కు గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.



తిర్యాణి: నేలమట్టం అయిన రేకుల షెడ్డు



భారీ వర్షానికి నేలకొరిగిన చెట్టు

సంక్షిప్త వార్తలు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెంచికల్‌పేట్: 18 ఏళ్లునిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సరిత ఓ ప్రకటనలో తెలిపారు. యువతి, యువకులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌ఫొటోలతో దరఖాస్తు ఫారం –6 పూరించి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు.

20న 'చలో ఎస్‌పీడీ' జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే చలో ఎస్‌పీడీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. కాగజ్‌నగర్ కేజీబీవీని శనివారం సందర్శించి అక్కడ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్‌పీడీ కార్యక్రమానికి ఉద్యోగులు తరలిరావాలని కోరారు.

17న శని భగవానుని జయంతి ఉత్సవాలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పోచమ్మబస్తీలో గల శ్రీ శని ఆలయంలో ఈనెల 17న శని భగవానుని జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పూజారి నందకిశోర్ జోషి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నవగ్రహపూజ, శ్రీ శని భగవానునికి తైలాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు నల్లపోచమ్మ దేవి బోనాలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీ మాత నల్లపోచమ్మ దేవి ఆలయంలో బోనాల ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఉదయం 11.30 నుంచి స్థానిక లారీ చౌరస్తా నుంచి అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

కెరమెరి: కెరమెరి నుంచి నిసానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. శనివారం నిసాని రోడ్డును ఆయన పరిశీలించారు. ఇంద్రానగర్, అగుర్‌వాడ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు సగం వరకు కూలిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. వెంటనే అధికారులు మరమ్మతు చేపట్టాలని కోరారు.

పాఠశాలకు హాజరుకావాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీరోజు విద్యార్థులు పాఠశాలకు హాజరుకావాలని ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం మొహమ్మద్ అష్రఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిటీ చైర్మన్ అబ్దుల్ హన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కెరమెరి: పాఠశాల అభివృద్ధిలో పేరెంట్స్ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్, హెచ్‌ఎంలు అన్నారు. గొయగాం, కెరమెరి, ఝరి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి: మండల వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని సమస్యలను వివరించారు. వాంకిడి నుంచి ఖమాన వెళ్లే రహదారి, ఇందాని, కనర్‌గాం రోడ్లు, కనర్‌గాం వాగుపై వంతెన, చౌపన్‌గూడ వెళ్లే రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని లక్ష్మీనగర్, ఇంద్రానగర్ కాలనీల్లో భగీరథ నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు.

బైక్‌ను వాగు దాటిస్తూ..



తిర్యాణి: కైరిగూడ ఓపెన్ కాస్టులో ఒప్పంద ప్రాతిపదికన పనులు నిర్వహించేందుకు గ్రామాల్లోని కార్మికులు గడలపెల్లిలోని పామడుగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో పామడుగు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో కార్మికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగుపై సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఇనుపకడ్డీలతో బ్రిడ్జి పనులు ప్రారంభించగా అవి నేటికి పూర్తికాలేదు. దీంతో కార్మికులు తమ బైక్‌లను ఇబ్బంది పడుతూ వాగును దాటిస్తున్నారు.

ఆర్థికసాయం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళ ఆత్రం జంగుబాయి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్ శనివారం లోకారి గ్రామానికి వెళ్లి బాధిత గిరిజన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాదిగూడ మండలం జైజంగు జైలింగు అధ్యక్షుడు వేద్మా విషం రావు, ఉపాధ్యాయుడు అర్జున్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. పక్కా సమాచారంతో మండల కేంద్రంలోని ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం తెల్లవారుజాము తనిఖీ నిర్వహించారు. కెరమెరి మండలం మోడి గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ రాజ్యాన్ టాటాసుమో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిర్పూర్(టి): మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని వెంకట్రావ్‌పేట చెక్‌పోస్ట్ వద్ద శనివారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. బైక్‌లపై బియ్యం తరలిస్తున్న శ్రీనివాస్, సంతోష్, రాజు, మిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రేషన్ బియ్యం విక్రయిస్తే వారి రేషన్‌కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్‌నంబర్ 9866398678లో సంప్రదించాలని సూచించారు.

తిర్యాణి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలు పొందేందుకు ఆగస్టు 10లోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ సెడ్మకి రాము ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్‌నంబర్ 9000595268లో సంప్రదించాలని సూచించారు.

రెబ్బెన: ఓపెన్ టెన్త్, ఇంటర్ కోసం ఆగస్టు 10వ తేదీ వరకు అడ్మిషన్లు తీసుకోవచ్చని రెబ్బెన స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు మేడి చరణ్‌దాస్, అనీస్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9491460670ను సంప్రదించాలని కోరారు.

జెడ్పీ వైస్‌చైర్మన్ దంపతుల పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీవైస్‌చైర్మన్ దంపతులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు సతీమణి రుక్మిణి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు నరహరిశర్మ, అర్చకుడు సంతోశ్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.